నేడు శివుడికి అభిషేకం

నల్లకుంట: మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం న్యూ రామాలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని వేదపండితుడు జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం శివుడికి అభిషేకం, విశేష పూజలు ఉంటాయన్నారు. అభిషేక పూజలో పాల్గొనాలనుకునే భక్తులు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

ఇంద్రసేనారెడ్డికి నివాళి

నల్లకుంట: మాజీ ఎమ్మెల్సీ దివంగత ఎస్. ఇంద్రసేనారెడ్డి ప్రథమ వర్ధంతి శనివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని గాంధీ సెంటనరీ హాల్‌లో జరిగింది. దీనికి హాజరైన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి మామ ఎస్. పద్మారెడ్డి, ప్లానింగ్ కమిషన్ చైర్మన్ చిన్నారెడ్డి, స్పోర్ట్స్ అడ్వైజర్ జితేందర్‌రెడ్డి, ఏపీ సీసీ మాజీ అధ్యక్షుడు రుద్రరాజు, జస్టిస్ గోపాల్ రెడ్డి, ఎం ఏ ఖాన్, కే. కేశవరావు, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు హాజరై ఇంద్రసేనారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల అస్వస్థతకు గురైన మాజీ ఎంపీ వి.హనుమంతరావు కార్యక్రమానికి హాజరుకాలేక ఫోన్ చేసి పరామర్శించి నివాళులర్పించారని ఇంద్రసేనారెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు.

పర్యాటక రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొ.పురుషోత్తమ్



గ్లోబల్ టూరిజం అంతర్జాతీయ ముగింపు సదస్సులో బుక్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

లాలాపేట: తెలంగాణ పర్యాటక రంగంలోని సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడంలో స్టార్టప్‌లు, వ్యవస్థాపక సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొ. పురుషోత్తమ్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'గ్లోబల్ టూరిజం న్యూ అవెన్యూస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. కామర్స్ కాలేజీలోని ఆడిటోరియంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సదస్సుకు ఆయన ముఖ్యతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రాంతీయ ఆర్థికవృద్ధికి బాధ్యతాయుతమైన పర్యాటక విధానాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అనంతరం ఈ మూడు రోజుల సదస్సులో చర్చించిన అంశాలపై రూపొందించిన బుక్‌ను ఆవిష్కరించారు. మన దేశం కలిగి ఉన్న సహజ సౌందర్యం, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని మార్కెటింగ్ చేయడంలో కృషి చేయాలని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేష్ అన్నారు. సదస్సు డైరెక్టర్ ప్రొ. చెన్నప్ప మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధిని సాధించడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడంలో నాణ్యమైన ప్రచురణలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సులో గ్లోబల్ టూరిజం ప్రమోట్ చేయడానికి చర్చించిన అంశాలపై ఓ నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో టీయూజేఏసీ

చిక్కడపల్లి: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో టీయూజేఏసీ తరఫున పోటీచేసే అభ్యర్థులను శనివారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో ప్రకటించారు. 22 మందితో కూడిన మొదటి విడత అభ్యర్థుల జాబితాను రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రపుల్‌రాంరెడ్డి విడుదల చేశారు. వీరంతా నామినేషన్ వేసి పోటీలో నిలుస్తారని అన్నారు. రెండో విడతలో మరికొంత మందిని ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు చంద్రన్నప్రసాద్, బి.రంగారెడ్డి, శంకర్‌రావు, హరిప్రసాద్, సుజి, అంజలికుమారి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు హెరిటేజ్ వాక్

శాలిబండ: వారసత్వ కట్టడాల విశిష్టతను పర్యాటకులకు తెలిపేందుకు ఈ నెల 19న రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్‌ను నిర్వహించనున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు హెరిటేజ్ వాక్ చార్మినార్ కట్టడం నుంచి ప్రారంభమై బాద్‌షాహీ అషూర్‌ఖానా వరకు కొనసాగుతుందన్నారు. ఈ వాక్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ శిక్షణార్థి అధికారులు దాదాపు 200 మంది పాల్గొంటారన్నారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

చిక్కడపల్లి: బీర్‌బాటిల్ పగిలి సెంట్రింగ్ పని చేసే ఓ యువకుడు మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లో నివసించే వీరేశం (26) సెంట్రింగ్ పనిచేస్తూ.. తల్లిదండ్రులు, అన్న దమ్ములతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా జవహర్‌నగర్‌లోని ఓ వైన్స్‌లో బీర్ బాటిల్ తీసుకుని స్కూటీపై తిరిగి ఇంటికి వస్తుండగా.. పిల్లర్ నం.30 వద్ద పడటంతో బీర్‌బాటిల్ పగిలి మెడకు తగలడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బర్కత్‌పుర డిపో ఎదుట ధర్నా చేస్తున్నఆర్.కృష్ణయ్య,ఎమ్మెల్యే పాయల్ శంకర్, గుజ్జ కృష్ణ



మహంకాళి ఆలయం వద్ద అఖిలపక్ష నాయకులు



బోర్డులు చించేసిన వారిపై కేసులు

బంద్ సందర్భంగా కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోల్ బంక్,టిఫిన్ సెంటర్, అవంతి కళాశాల బోర్డును చింపేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బర్కత్‌పుర వద్ద రాఘవేంద్ర హోటల్ తెరిచి ఉండడంతో కొందరు అక్కడకు వెళ్లి కౌంటర్ అద్దాలు పగులగొట్టారు. పెట్రోల్ బంక్‌లో రీడింగ్ మెషిన్లపై కర్రలతో కొట్టి మెషిన్లను పాడు చేశారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఆందోళనకారులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. – కాచిగూడ

బంద్ విజయవంతం

- డిపోలకే పరిమితమైన బస్సులు
- ధర్నాలు, రాస్తారోకోలతో స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు
- పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఉద్రిక్తత పరిస్థితులు



ముషీరాబాద్ డిపో-2 వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ శనివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బంద్ విజయవంతమైంది. ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నాయకులు ఉదయం నుంచే రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. బస్సు డిపోల్లో నుంచి బస్సులు రాకుండా కట్టడి చేశారు. దుకాణాలు, విద్యాసంస్థలను మూసివేయించారు. బస్సులు లేకపోవడంతో వివిధ ప్రాంతాల వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఆయా బస్సు డిపోల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బస్సులు నడవకుండా కాచిగూడ, బర్కత్‌పుర ఆర్టీసీ డిపోల వద్ద నేతలు బైటాయించారు. కొంత మంది అకతాయిలు బర్కత్‌పురలో తెరిచి ఉంచిన పెట్రోల్‌బంక్, ఓ హోటల్ వద్ద గొడవకు దిగారు. పలు ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. బంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, అంబేడ్కర్ సంఘాల వారు మద్దతు తెలపడంతో పాటు, బీసీ సంఘాలతో కలిసి ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటామన్నారు. ఆయా చోట్ల పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ల బృందం

ఫ్లెక్సీ తట్టుకుని కిందపడిన వీహెచ్



అంబర్‌పేట: బీసీ బంద్‌లో అపశ్రుతి చోటు చేసుకుంది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు కిందపడిపోయారు. శనివారం అంబర్‌పేటలో చేపట్టిన బంద్‌లో ఆయన పాల్గొని ర్యాలీగా వెళ్తుండగా ఫ్లెక్సీ కాళ్లకు అడ్డుగా తగిలి పడిపోయాడు. సీనియర్ నాయకులు ఒక్కసారిగా కిందపడిపోవడంతో అంతా ఉలిక్కిపడ్డారు. వెంటనే పక్కన ఉన్న నాయకులు తెరుకుని కిందపడిపోయిన వీహెచ్‌ను పైకిలేపి నీరు అందించారు. అనంతరం వీహెచ్ ర్యాలీలో తిరిగి పాల్గొన్నారు. కిందపడ్డప్పటికీ వీహెచ్ తిరిగి బంద్‌లో పాల్గొనడం పట్ల అంతా ఆశ్చర్యానికి గురయ్యారు.



బీసీ బంద్‌లో డప్పు కొడుతున్న వీహెచ్



ఇందిరాపార్కు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎర్ర సత్యనారాయణ, బీసీ సంఘాల నేతలు



బీసీ బంద్‌లో ప్రజా సంఘాల నాయకులు



అఖిలపక్ష పార్టీలతో కలిసి బంద్‌లో బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ



బీసీ బంద్‌లో బీజేపీ నేతల బైక్‌ర్యాలీ



బీసీ బంద్‌లో ర్యాలీలో కాంగ్రెస్ నేతలు



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బంద్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నేతలు



సుందరయ్య పార్కు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సమన్వయ కమిటీ నాయకులు

'ఏ దివిలో విరిసిన పారిజాతమో..'



ఏనుగు నరసింహారెడ్డికి ఆత్మీయ సత్కారం చేస్తున్న కళా జనార్దనామూర్తి, ప్రసాద్ కొమర్రాజు

చిక్కడపల్లి: మల్లెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో త్యాగరాయ గానసభలో 'ఏ దివిలో విరిసిన పారిజాతమో..'శీర్షికతో శనివారం నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ నూతన సంచాలకుడిగా నియమితులైన ఏనుగు నరసింహారెడ్డికి ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాటకు అభిమానులు కానివారు ఉండరని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్ష ఉపన్యాసం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావడంతో నరసింహారెడ్డి భూమిక పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ప్రసాద్ కొమర్రాజు, విశ్వనాథ్, మల్లెల వసుంధర, కమలాశాస్త్రి, శరత్, కృష్ణ, కల్యాణ్, నాగభూషణం, కృష్ణమోహన్, పద్మ, అనురాధ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ ధోబీఘాట్లకు నిధులు కేటాయించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పి. ఆశయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో మోడ్రన్ ధోబీఘాట్లకు నిధులు కేటాయించాలని తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఆశయ్య డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆశయ్య మాట్లాడుతూ... ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కల్పన, వృత్తుల ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. రజక ఫెడరేషన్‌కు పాలక వర్గాన్ని నియమించాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రమణ, పి.మల్లేష్, రాములు, వెంకటేష్, గోపాల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సకల కళల సమ్మేళనం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం సకల కళల సమ్మేళనమని తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో నృత్యమాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీల సంయుక్తాధ్వర్యంలో అఖిల భారత స్థాయి డ్యాన్స్, మ్యూజిక్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం సమాజంలో శాస్త్రీయ సంగీత కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా పలువురు నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీనటి కరాటే కల్యాణి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సునిత, నృత్య గురువు డాక్టర్ ఎం.ఏకవీర, సంస్థ వ్యవస్థాపకులు వీరేష్ యాదవ్, సిరి తదితరులు పాల్గొన్నారు.



కళాకారులతో ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 43మంది

38మందికి జారిమానా, ఐదుగురికి జైలు

చిక్కడపల్లి: మద్యం సేవించి వాహనాలు నడిపిన 43 మంది పట్టుబడినట్లు చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు తెలిపారు. శనివారం ఆయన రాత్రి విలేకరులతో మాట్లాడుతూ.. డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన 43 మందిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామన్నారు. అందులో ఇద్దరికి మూడు రోజులు, ఒకరికి ఆరు రోజులు మరో ఇద్దరికి 11రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మిగతా వారికి జరిమానాలు విధించారని పేర్కొన్నారు. అందరికీ కలిపి మొత్తం రూ. 1,28,300 జరిమానా విధించినట్లు తెలిపారు.

జ్యువెలరీ షాప్‌లో చోరీకి యత్నం

ఇద్దరి రిమాండ్

డబీర్‌పురా: జ్యువెలరీ షాప్‌లో దొంగతనానికి ప్లాన్ వేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోని మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంచల్‌గూడలోని ముజ్తబా జ్యువెలరీ దుకాణాన్ని లక్ష్యంగా చేసుకొని దొంగతనం చేసేందుకు సివిల్ ఇంజినీర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ (46), చాంద్రాయణగుట్ట కేశవగిరికి చెందిన సయ్యద్ కబీర్ (34)తో పాటు మరో మైనర్ బాలుడితో ప్లాన్ వేశారు. ఇందులో భాగంగా దొంగతనానికి కావాల్సిన వాల్ కట్టర్ మిషన్, పెద్ద, చిన్న హ్యామర్, డ్రిల్ మిషన్, హెల్మెట్, వైర్ కట్టర్,టార్చ్ లైట్‌లను జుమ్మెరాత్‌బజార్‌లో కొనుగోలు చేశారు. మత్తు పదార్థాలు హఫీజ్‌బాబానగర్‌లోని మెడికల్ షాపులో కొనుగోలు చేశారు. ప్లాన్‌లో భాగంగా ఈ నెల 10న చంచల్‌గూడలోని మారుఫ్ ట్రావెల్స్ దుకాణంలోకి వెళ్లిన వీరు ముగ్గురు తాము ఖురాన్ పఠనాన్ని పూర్తి చేసిన సందర్భంగా కూల్‌డ్రింక్‌ను పంపిణీ చేస్తున్నామని తెలిపి యజమాని ఖాజా సోహెబుద్దీన్ ఖాన్‌కు ఇచ్చేందుకు ప్రయత్నించగా నిరాకరించాడు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రాంతాల్లో పలువురికి ఈ మత్తు పదార్థాలు కలిపి కూల్‌డ్రింక్‌ను పంపిణీ చేశారు. దీంతో వారు గాఢ నిద్రలోకి జారుకున్నారు. అనంతరం చంచల్‌గూడలోని ముజ్తబా జ్యువెలరీ దుకాణంలో వారికి అందజేసి వారు మత్తులోకి జారుకున్న అనంతరం దొంగతనం చేసేందుకు ప్రయత్నించి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దొంగతనానికి విఫలమయ్యారు. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శనివారం సయ్యద్ అహ్మద్ ఖాన్, సయ్యద్ కబీర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా..మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేయాలి

చిక్కడపల్లి: అరుంధతినగర్‌లో చేపడుతున్న నూతన తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. శనివారం డివిజన్‌లోని అరుంధతినగర్ వాటర్‌వర్క్స్ అధికారి కృష్ణమోహన్‌తో కలసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. పనుల్లో నాణ్యతను పాటించాలని అన్నారు. వరుస పండుగల నేపథ్యంలో కొంతమేర ఆలస్యం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నేతలు నవీన్‌కుమార్, ఉమేష్, ఆనందరావు, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సంగీతం మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది'



సినీ నేపథ్య గాయని మాలవికకు పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: సంగీతం మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ డి.చక్రపాణి అన్నారు. శనివారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనంద భైరవి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి నిర్వహించారు. సినీ నేపథ్య గాయకులు మాలవిక, సాందీప్‌కు ఉత్తమ సినీ నేపథ్య గాయకుల అవార్డు, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి ఆనంద భైరవి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంగీతం వినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. అంతకు ముందు పలువురు గాయనీ గాయకులు నాటి నుంచి నేటి వరకు పాత మధుర గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ విశ్రాంత డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, కర్ణాటక సంగీత విద్వాంసులు కేవి.బ్రహ్మానందం, సంస్థ వ్యవస్థాపకురాలు శారద సాయి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా

సుల్తాన్‌బజార్: కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శనివారం కోఠి డీఎంహెచ్ఎస్‌లో ధర్నా నిర్వహించి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఎండీ యూసుఫ్ ఎం.నర్సింహాలు మాట్లాడుతూ..టీమ్స్ ఆసుపత్రి ద్వారా కరోనా సమయంలో నియమితులైన కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని 2022 సంవత్సరం నుంచి డీఎంఈ పరిధిలోని వివిధ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించుకుంటున్నారని, వారికి గత 7 నెలలుగా జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎంఈ అధికారులకు పలుమార్లు వినతి పత్రం సమర్పిస్తున్నా పెడచెవిన పెడుతున్నారని అందుకు నిరసనగా ధర్నాకు దిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిషన్, రజిత, లావణ్య, సుప్రియ, రత్న, సుజాత, స్వాతి, జయలక్ష్మి, స్వప్న, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నర్సింగ్ సిబ్బంది, యూనియన్ నాయకులు